

# విరామం

## - అంగర వేంకట కృష్ణారావు



*1939 నుంచి 45 వరకూ జరిగిన రెండో ప్రపంచ మహాయుద్ధం మానవ జాతి మనుగడలో ఒక బృహత్తర ఘట్టం. ఈ సమరంలో రాజ్యాలు చూస్తూండగా పేక మేడల్లా కూలిపోయేయి. మహానగరాలు తిరగట్లో పప్పులా పిండైపోయేయి. మనుషులు కుంపట్లో పడ్డ చీమల్లా మాడిపోయేరు. ఆ విధ్వంసకాండ అభూతం! వర్ణనాతీతం.*

*పోతే, యిక మరి యుద్ధం వద్దనిపించిందా? మరి హింస వద్దు అనిపించిందా? ఉహుఁ యుద్ధమన్నా, హింసన్నా, జంకుపోయిందేమో...యుద్ధమే యెల్లప్పుడూ సాగేది. శాంతి ఒక "విరామం" లాంటిది.*

*ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రికలో ధారావాహికంగా వెలువడ్డ ఈ నవల్లో అడుగడుగునా "నేను" వున్నా ఇది కేవలం నా వూహ కాదు. ఈ ప్రదేశాలు నా కళ్ళతో చూసినవి. అయితే, రచనకి కల్పన అవసరం. ఇందులో కల్పన 'అంత మాత్రమే' వుంది.*

అంగర వెంకట కృష్ణారావు

*ఒక చిన్న మాట!*

*ఇటీవల తెలుగులో వస్తున్న నవలలన్నీ అపౌరుషేయాలు. భబానీ భట్టాచార్య బెంగాల్ క్షామం గురించి వ్రాసిన 'సోమెనీ హంగర్స్' తో తులతూగ గల మొట్టమొదటియుద్ధ దుష్ఫలితాల నభివ్యక్తం చేసే నవల తెలుగులో 'విరామం' అంటే ఎవరూ ఆశ్చర్యపోనక్కరలేదు. సాంస్కృతిక జీవనం పూర్తిగా స్తంభించిపోయి, అన్ని కళలూ, శాస్త్రాలూ, సర్వమూ సినిమాకు, రాజకీయాలకూ దాస్యం చేస్తున్న ఈ రోజులలో, శక్తిమంతమైన రచనలు రావటానికి ఉన్న అవకాశాలు దాదాపు మృగ్యం. సాహిత్యంలో వచ్చే కొత్త పోకడలను పసికట్టి, ఆదరించి ప్రోత్సహించే స్థితిలో పత్రికలు, ప్రచురణకర్తలు లేకపోయినట్లయితే, ఇక ఆ దేశపు దౌర్భాగ్యం గురించి చెప్పనవసరం లేదు. మనుష్యులలో ఏ ఒక జాతిపట్లనైనా ద్వేషం ప్రకటించడం యావత్తు మానవజాతినీ ద్వేషించడం కాగలదనే జ్ఞానం కూడా లేని రచయితలున్న మన దేశంలో, సాహిత్యం కాలక్షేపానికి తప్ప మరెందుకూ పనికి రాదేమో...ఈ పై సందేహాలన్నిటికీ నివృత్తి 'విరామం' నవల. అందుచేత తెలుగు నవలా సాహిత్యంలో శ్రీ అంగర వెంకట కృష్ణారావుగారి 'విరామం' ఒక కొత్త మలుపు. బెంగాలీలో భబానీ భట్టాచార్య, బిభూతి భూషణ బందోపాధ్యాయ, మానిక్ బందోపాధ్యాయ, మలయాళంలో తక్కాళి శివశంకర పిళ్లై, తమిళంలో ఆర్.కె.నారాయణ్, కానా శివసుబ్రహ్మణ్యం వంటి రచయితల కోవలోకి చేరుతారుతెలుగులో చాసో, కె.కె., రా.వి. శాస్త్రి, అంగర వెంకట కృష్ణారావు, కాళీపట్నం రామారావులు.ఇతివృత్తం, భాష, శైలి శిల్పం, పాత్ర పోషణతో సహా అన్నింట్లోనూ 'విరామం' భారతీయ భాషలలో వచ్చే ఏ ఉత్తమ నవలకు తీసిపోదని నవినయంగా మనవి చేసుకుంటున్నాను.*

పురాణం సుబ్రహ్మణ్యశర్మ

విజయవాడ, 24-1-1970

*(గత సంచిక తరువాయి)*

**మేమంతా** రెండువందలకి కొంచెం ఎక్కువగా వున్నాం. నేను వెయ్యిమందికి సరిపడ్డ రేషను మోసుకొచ్చా. మా రేషను స్టోరుదగ్గిర తెల్లవాళ్ళూ 'రంగువాళ్ళూ' చాలామంది గుమికూడేరు. సరుకు ట్రక్కులోంచి స్టోరులోకి తీసుకెళుతూంటే అంతా సిగరెట్లు కాలుస్తూ 'FN' లు జోరుగా ఒదుల్తూ తమాషా చూస్తున్నారు. ఓసీ నా రెండు భుజాలమీదా చేతులు వేసి మొహంలో మొహం పెట్టి నవ్వేడు.

“హవల్దార్! చెప్పు. ఇదెలా చేసేవు?''

“నేననుకోలేదు. వెళ్లి చూస్తే అక్కడ “గరిటవాడు” నా స్నేహితుడు “సిక్స్తి ఇండియన్” ఎప్పుడొచ్చినా రేషన్లిలాగే యిమ్మని అక్కడి వాళ్ళతో చెప్పేడు.

“అద్భుతం! నిజంగా అద్భుతం” ఓసీ నవ్వుతూ అన్నాడు.

నేను తిన్నగా బాషాకి వెళిపోయి కుర్చీలో కూలబడి నిట్టూర్చా.

దేశంలో ముఖ్యంగా తూర్పు బెంగాల్లో లక్షలాది ప్రజలు – ఆడ, మగ, పసివాళ్ళు, అన్నమో రామచంద్రా అని అలమటించిపోతూంటే వాళ్ళ ఆకలి నోళ్లని వూరిస్తూ అన్నపు కొండలు నడిచి వెళ్లిపోతున్నాయి. నేలపాలవుతున్నాయి. ఈ పరిస్థితి మారుతుందా అనుకున్నా. నాటికీ నేటికీ మారలేదు. రంగం మారింది కాని అదే నాటకం. పాత్రధారులు మారేరు గాని అవే పాత్రలు. కాళ్ళు మారేయి గాని అవే జోళ్ళు.

7

నెలరోజులు గడిచేయి. ఈ నెల్లాళ్ళలో నేను మళ్ళీ రాయ్ ని, (అంటే కమల్ ని) కలియలేదు. పద్మని కలియడానిక్కూడా అవకాశం చిక్కలేదు.

పదిరోజుల క్రితమే అక్కడికొక వెస్టాఫ్రికన్ ఆర్టిలరీ రెజిమెంటొచ్చింది. తెల్లవాళ్ళూ, నీగ్రోలూ మొత్తం ఏడెనిమిది వందలమంది వుంటారు.

నీగ్రోలు చాలా మంది క్రైస్తవులు, కొందరు మహమ్మదీయులు కూడా వున్నారు. కారు నలుపు నించి మట్టిరంగు వరకూ వాళ్ళ శరీర వర్ణం. పొడుగ్గా, రాతి విగ్రహల్లా వుంటారు. చక్కని యింగ్లీషు కొంచెం యాసగా మాట్లాడతారు. వాళ్ళని చూస్తే భయమేస్తుంది. ఆడది ఆ నీగ్రో సోల్జర్ని చూస్తే జడుసుకుంటుంది. కాని వాళ్ళు సాధారణంగా నెమ్మదస్తులు, మర్యాద తెలిసిన వాళ్ళు.

తెల్లవాళ్ళు నీగ్రోల్ని భారతీయుల్ని చూసినట్టే చూస్తారు. క్యాంపులో భారతీయుల విడిదుల్ని దూరంగా వుంచినట్టే నీగ్రో విడిదుల్ని కూడా దూరంగా వుంచారు. హోదాల పేర్లు యిద్దరివీ వొకటే. నీగ్రోలలో కమిషన్లు ఆఫీసర్లు లేరు.

నీగ్రోసార్జంటు తెల్లప్రైవేటుకి కూడా లోకువ. విడిదులు వేరు, మెస్సులు వేరు, జీతాల్లో తేడా సరేసరి. జాతి భేదం కొట్టొచ్చినట్టు ఉండిపోయింది.

వెస్టాఫ్రికను రెజిమెంటు మాపొరుగున వుండడంచేత మాకూ వాళ్ళకీ కత్తు కలిసింది. నా కిద్దరు ముగ్గురు నీగ్రోలు స్నేహితులయేరు. వాళ్ళకి ఈ యుద్ధం యిష్టం లేదు. అదంతా తెల్లవాడి మాయ అని నాతో రహస్యంగా అనేవాళ్లు.

కొత్త యూనిటు రాకతో దాసు క్యాంటీను విస్తరించింది. ఇతర వ్యాపారం కూడా పెరిగింది. దాసు కొత్త క్యాంపులో తెల్లవాళ్ళ భాగంలోకి రాత్రిళ్ళు పులుల్ని ప్రవేశ పెట్టడం ఆరంభించేడు. క్యాంపులో ఆకలి నిప్పు దాసు ప్రోత్సాహపు గాలిచేత భగభగ మండింది. ఆ మంటలకు పులులు ఆహుతి అవుతున్నాయంటే ఆశ్చర్యం లేదు. తినడానికి వొక్క చపాతీ యిస్తే రాత్రల్లా కలిసి పడుకోవడానికి సిద్ధంగా వున్న వాళ్ళ పరిస్థితి అలాంటిది.

ఒక అర్ధరాత్రి నేను గాఢ నిద్రలో వున్నా. హఠాత్తుగా పెద్ద పెద్ద కేకలు వినిపించాయి. నేను గాభరాపడి లేచా. షిరాజ్ పూరు వేపునించి మంటలవుపించేయి. సిపాయిలు లేచి అటు బిల బిలా పరిగెడుతున్నారు. నేనూ వెళ్ళా.

షిరాజ్ పూర్ కాలిపోతోంది. ఐదారు కొంపలొకేసారి దమ దమ కాలిపోతున్నాయి. పిల్లా పిచికని చేరదీసుకుని ఆ గ్రామీణులు గుంపులుగా వొకళ్ళలో వొకరు దూరి మంటలు చూస్తూ గుండెలు బాదుకుని ఏడుస్తున్నారు. అక్కడ మా యూనిటు వాళ్ళు, వెస్టాఫ్రికన్ రెజిమెంటు వాళ్ళు కొన్ని వందల మంది గుమిగూడేరు. మంటలార్పడానికి తగిన సాధనాలు లేవు. అంతా ఆ మంటల్ని వింతగా చూస్తున్నారు. కొందరు వినోదం పొందుతున్నారు. ఇళ్ళు కాల్తుంటే చూడ ముచ్చటగా వుంటుంది. కాని ఆ యిళ్లు మనవి కాకపోతేనే.

అక్కడ చూడదగింది యిళ్ళు కాలడం ఒక్కటే కాదు. మూడు శవాలు పడివున్నాయి. అవి అగ్ని ప్రమాదంలో చచ్చిపోయిన వాళ్ళవి కావు. పిస్తోలు గుళ్ళకి ఆహుతైన వాళ్ళవి. నేను దగ్గరికెళ్ళి చూశా. రెండు మగ శవాలు, ఒక ఆడ శవం. మగశవాలు అబ్దుల్, అతని పెద్ద భార్య కొడుకు యిరవైయేళ్ళ రజాక్. ఆడశవం అబ్దుల్ రెండో భార్య చిన్న కూతురు మున్నీ. నేను అదిరిపడ్డా. "అబ్దుల్! ఏం జరిగింది, ఎలా వుంది?" నేను నిశ్శబ్దంగా ప్రశ్నించా. జవాబు కోసం కాదు, గుండె మండి.

ఆ రాత్రి సుమారు పదిగంటలకి వెస్టాఫ్రికన్ రెజిమెంటుకి చెందిన గన్నరు"డ్రైవరు"షిరాజ్ పూర్లో ప్రవేశించాడు. అంతా ప్రశాంతంగా నిద్రపోతున్నారు. డ్రైవరు చిత్తుగా తాగేడు. అబ్దుల్ యింటి తలుపు తట్టేడు. అబ్దుల్ తెరిచాడు. ఆ గదిలో అబ్దుల్, అతని రెండో భార్య, ఆమె పెద్ద కూతురు పదహారేళ్ళ రజియా, చిన్న కూతురు నిద్రపోతున్నారు.

రజియా, తల్లిలా పొడుగ్గా, అందంగా వుంటుంది. డ్రైవరు ఆ పిల్ల మీద కన్నేసివున్నాడు. చాలాసార్లు ఆమెను తరిమేడు. ఆమె అతనికి చిక్కలేదు. ఎలాగైనా ఆమెని అనుభవించాలని పట్టుపట్టేడు. అబ్దుల్ నాతో ఈ విషయం రెండు మూడు సార్లు చెప్పేడు.

తాగివచ్చి గుమ్మం ముందు నిలబడ్డ సోల్జర్ని చూసి అబ్దుల్ గాభరాపడ్డాడు. ఏం కావాలని భయపడుతూ అడిగేడు తన భాషలో. డ్రైవరు ధుమ ధుమ లాడుతూ "బైటికిరా బైటికిరా" అని గదమాయించేడు. ఈ ఘర్షణతో గదిలోవున్న అందరికీతెలివొచ్చింది. వాళ్ళు హడలిపోయేరు. ఒక్కొక్కరూ బైటకొచ్చేరు. రజియా కూడా రాబోయింది. డ్రైవరా పిల్లని లోపలకు నెట్టి, తనూ గదిలో ప్రవేశించి, తలుపు లోపల గడియవేశాడు.

రజియా లోపల మొర్రో అని యేడుస్తూంది. బైట అబ్దులూ, భార్య కేకలేస్తూ తలుపులు బాదుతున్నారు. ఊరందరూ లేచిపోయి అబ్దుల్ యింటి ముందు గుమిగూడి కేకలేస్తున్నారు కానీ గదిలో డ్రైవరు చలించలేదు.

అబ్దుల్ వూరికి పెద్ద. అతనికి రెండో భార్యమీద ప్రేమ ఎక్కువ. అంచేత పక్కాగది కట్టి లోపల వీలైనంత నీటుగా, చక్కగా అన్నీ అమిర్చేడు.

రజియా డ్రైవరుకి వో పట్టాన లొంగలేదు. మీదకొస్తుంటే తోసింది, రక్కింది. కాని వాడన్నిటికీ తెగించాడు. ఆమె మెడమీద చేత్తో కొట్టేడు. మొహం ఝుమాలు మనిపోయింది. బైట అంత గోలవుతున్నా తాగుడు వేడివల్ల, కామం వల్ల స్పృహలేని రజియాని వాడు పశువులా బలాత్కరించేడు.

లేచి, బట్టలు వేసుకుని, జేబులోంచి పిస్తోలు తీసి ముందుకి గురి పెట్టి పట్టుకుని తలుపులు తెరిచేడు. బైటవాళ్ళలో చాలామంది కర్రలు పట్టుకు సిద్ధంగా వున్నారు.

తలుపు తియ్యగానే అబ్దుల్ డ్రైవరు మీదికి దూకేడు. ఢాం మని గుండు పేలింది. అబ్దుల్ పక్షిలా రాలిపోయేడు. ఒక్క క్షణం నిశ్శబ్దం. అంతా దిస్సపోయేరు. వెంటనే అబ్దుల్ రెండో భార్య హోరని యేడుస్తూ భర్తవేపు పరిగెత్తింది. అబ్దుల్ కొడుకు ఆమెను వారించి తను డ్రైవరు మీదికి ఎత్తిన కర్రతో దూకేడు. ఢాంమని మళ్ళీ గుండు పేలింది, యువకుడు పిట్టలా రాలిపోయేడు. పిస్తోలు మీట నొక్కడంలో ఆనందం అనుభవించే ఆ కసాయివాడు ఈ సారి గిరీ గురీ లేకుండా "ఢాం" మనిపించేడు. ఐదేళ్ళ మున్నీ రాలిపోయింది.

జనం బెగిలిపోయేరు. వెనక వెనక్కి తగ్గి పారిపోయేరు. అమాయకులు, అంతకన్న ఏంజేస్తారు?

డ్రైవరు వెళిపోయేడు. కాని అతనికసి తీరలేదు. పది నిమిషాలలో మరైదుగురు తెల్లవాళ్లతో తిరిగి వచ్చేడు. అంతా తప్పతాగి వున్నారు. పెట్రోలుపోసి యిళ్లకి నిప్పంటించేరు. చర్రున మంటలాకాశంలోకి లేచేయి. గ్రామంలో ఒకటే గోల. రౌడీ మూక తనపని ముగించుకు పారిపోయింది.

తరవాత చాలామంది అక్కడ చేరేరు నాలాగే.

తెల్లవారేసరికి షిరాజ్ పూరులో ఒక్క కొంప కూడా మిగల్లేదు. మూడు శవాలు, కాలిపోయిన యిళ్ళు, శవాల్లా మిగిలిన వాళ్ళూ వున్నారు.

మా యూనిట్ అధికార్లూ వెస్టాఫ్రికను యూనిటు అధికార్లూ యీ ఘోర నేరం గూర్చి దర్యాప్తు చేసేరు. తెల్లవారంతా కలిసి ఈ నేరం యిద్దరు నీగ్రోలమీద పెట్టేరు.

ఈ దర్యాప్తు మా కమాండెంటు కల్నల్ సిల్వన్, ఆఫ్రికను రెజిమెంటు కమాండెంటు కల్నలు ఓకోనరు ఆరంభించేరు. ముద్దాయిలు మాకేం తెలీదన్నారు. గ్రామీణుల్లో సాక్షులు ఈ పని తెల్లవాళ్ళే చేసేరని ఖచ్చితంగా చెప్పేరు. జరిగినదంతా మొదటినించి తెలిసిన అబ్దులు లేడు. అతని రెండో భార్య కొంత చెప్పగలదు.

మధ్యాహ్నం మూడు గంటలకి రెండు యూనిట్లు తెలుపు నలుపు సిబ్బందినీ వరుసగా నిలబెట్టేరు. అబ్దుల్ భార్యని రప్పించి దోషిని పోల్చుకోమన్నారు. ఆమె భర్త, కూతురు పోయారన్న బెంగతో, రాత్రి జరిగిన మారణ హోమానికి కుంగిపోయివుంది. పైగా తెల్లవాళ్ళంతా ఒకలాగే వుంటారు. బాగా పరిచయ ముంటే గాని చదువుకున్నవాళ్ళే పోల్చుకోలేరు. ఆమె అందర్నీ దాటి వెళ్లిపోయినట్టు, దోషినికూడా దాటి వెళ్లిపోయింది. హంతకుడు దొరకలేదు.

ఈ పని యెవరో యితరులు చేసుంటారన్నాడు కల్నల్ ఓకోనరు. కాని మా ఒ.సి.కి అది తృప్తిగా లేదు. మానభంగమైనపిల్లని రప్పించమన్నాడు. రజియా కాలిపోయిన వూరు దగ్గరే వుంది.రానని మొండి పట్టుపట్టింది. కల్నలు ఉన్న గ్రామీణుల్లో ఒక పెద్దని పిల్చి గట్టిగా చెప్పేడు.

“ఆమెకేమీ భయంలేదు. ఆమె స్వయంగా వచ్చి దోషిని పోల్చాలి. ఇప్పుడు న్యాయం ఆమె చేతిలో వుంది. మీరంతా వెళ్ళి ఆమెకి నచ్చ చెప్పండి.” ఓ.సీ. అన్నాడు.

చివరకెలాగో జంకుతూ వచ్చింది రజియా. కల్నలామెకి ధైర్యం చెప్పి దోషిని పోల్చుకోమన్నాడు. రజియా రంగు వాళ్ళవేపు వెళ్ళనేలేదు. తెల్లవాళ్ళ వరసల దగ్గరకెళ్ళి, ఓమారందర్నీ చూసి తలవూపి అక్కణ్ణించి పారిపోబోయింది. కల్నల్ ఆమెని వారించి 'కమాన్' అని ఆమెని స్వయంగా తీసుకెళ్లాడు. ఒక్కొక్కడి ముందు నిలబెట్టి “ఇతనా”అని ప్రశ్నించేడు. ఆమె కాదని తల వూపుతూంది. డ్రైవరు ముందుకి రాగానే రజియా కొయ్య బొమ్మలా నిలబడిపోయింది. అతని మొహంలోకి తేరిచూసింది. ఆమెకి తలతిరిగింది. కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి. డ్రైవరువేపు, కల్నలువేపు గబగబా చూపులు మార్చి, వణికిపోతూ బావురుమంది. ఒకమారు చూపుడు వేలు డ్రైవరు గుండెమీద పొడిచి కుప్పలా కూలిపోయింది.

డ్రైవరు హంతకుడు, మానంభంగం చేసిన వాడని తెలిసిపోయింది. పెద్ద కేసైంది. కాని పర్యవసానం తెలీనివ్వలేదు.

8

ఈ హత్యలకీ గృహదహనాలకీ సంబంధించిన కేసు వెస్టాఫ్రికన్ రెజిమెంటుకి దఖలు పడిన మూడోనాడు సాయంత్రమే మా ఆర్.హెచ్.క్యూకి కొమిల్లాకి పురోగమించమని తాఖీదొచ్చింది. మర్నాడుదయమే వాళ్ళు

బయల్దేరుతున్నారు. అంటే మాకూ వాళ్ళకీ యెడబాటొచ్చిందన్న మాట. కాని అది తాత్కాలికమే. రెజిమెంటు, బ్యాటరీలు ఎక్కడుంటే మేమూ అక్కడే వుండాలి.

రాత్రి విందులూ, వీడ్కోలూ జరిగేయి. అసలు మానవ జీవితమే కలుసుకోవడం విడిపోడం. అందులో, యుద్ధ సమయంలో సైనిక జీవితంలో యిది తరచు సంభవిస్తుంది. ప్రపంచంలో మూలమూలల వాళ్ళు వొకచోట కలుస్తారు. కలిసి కొన్ని రోజులు గడుపుతారు. విడిపోతారు. ఈ అనుభవానికి ఆదిలో కొందరు రక్త సంబంధీకుల్ని విడిచి పెట్టవలసినప్పుళ్లాగే దిగులు పడతారు. క్రమేపీ ఈ అనుభవం అలవాటై పోతుంది.

మర్నాడుదయం ఆర్.హెచ్.క్యూ కదుల్తూంది. ప్రభూ నాతో కరచాలనం చేశాడు. నా గుండెలో గాభరా వేసింది. మేలాసింగు వేపు నేను చెయ్యిజా పేను. అలాక్కాదని అతను నన్ను గట్టిగా గుండెకు అదుముకున్నాడు. నా కళ్ళంట నీళ్ళు బొటబొట కారేయి. అతని కళ్ళు చెమ్మగిలలేదు. కాని ఉత్కంఠతో యెరుపెక్కాయి. మాట పెకిలించుకొని 'ఫిర్ మిలేంగే" అన్నాడు. వాళ్ళిద్దరూ ట్రక్కులోకెక్కేరు. "కాన్వాయ్" బైల్దేరింది. క్షణంలో కనుచూపు మేర దాటిపోయింది.

పందొమ్మిది వందల నలభై వొకటి చివరలో ఆగ్నేయ ఆసియా యుద్ధం ఆరంభమైంది. మరుచటి యేడు ఆరంభంలోనే జపాను సైన్యాలు నల్లేరుమీద బండిలా పురోగమనం ఆరంభించాయి. మొదట సయామ్ పడిపోయింది. తరువాత రంగూన్తో సహా బర్మా శత్రువశమైంది. వాళ్ల రాకకి ఇండియా పొలిమేరలు దడదళ్ళాడేయి.

పందొమ్మిది వందల ముప్పైతొమ్మిది సెప్టెంబర్ నెల చరిత్రలో మరపురానిది. పద్ధతి ప్రకారం యుద్ధం ప్రకటించకుండా, చివరి గడువైనా యివ్వకుండా, జర్మనీ నియంత, నాజీ హిట్లర్ ఆ నెల ఒకటో తారీఖున సాయంత్రం నాలుగ్గంటల నలభై ఐదు నిమిషాలకి అశేష సైన్యంతో పోలెండుమీద కుపక్రమించాడు. హిట్లర్ సైన్యం "నడుస్తున్న వుక్కు గోడ." పోలెండు కొన్ని గంటల్లో చేతులెత్తేసింది, తరవాత హాలెండు, బెల్జియం పడిపోయేయి. ఫ్రాన్సులో దుర్భేద్యం అని పేరుపడ్డ "మాగినాటులైను"ని జర్మనీ తప్పించి ఫ్రాన్సుమీద విరుచుకుపడింది. ఫ్రాన్సు పేకమేడలా పతనమైపోయింది.

ఈ పరిస్థితికి ప్రపంచం తెల్లబోయింది. బ్రిటిష్ పెద్దలు మూకుట్లో కూరముక్కల్లా వేగిపోయేరు.

ఇంగ్లండు జర్మనీమీద వెంటనే యుద్ధం ప్రకటించింది. అప్పటి బ్రిటిష్ ప్రధాని నెవిల్ ఛాంబర్లేను రేడియో ద్వారా ప్రజలకిచ్చిన సందేశం చరిత్రాత్మకం.

''హిట్లరు చెప్పిన ఏ మాటా నమ్మరాని పరిస్థితి నేడు కలిగింది. ఈ పరిస్థితిలో ఏ ప్రజలుగాని, దేశంగాని క్షేమంగా వుండలేదు. ఇది భరించరానిది. అంచేత ఈ పరిస్థితిని నిర్మూలించడానికి మనం నిశ్చయించేం. మీరంతా నిదానంతో, మనోధైర్యంతో మీ విధి నిర్వర్తిస్తారని నాకు తెలుసు. మన సామ్రాజ్యంలో ప్రజలు కూడా మనకి అండగా నిలుస్తామని మాట యిచ్చి ధైర్యం గొల్పేరు. మిమ్మల్నందర్నీ దేవుడు దీవిస్తాడు. అతడు న్యాయాన్ని పరిరక్షిస్తాడు. మనం

ఎదిరించబోతున్నది, దుర్మార్గాన్ని, పశుబలాన్ని, దుష్టసంస్థని, అక్రమాన్ని, పీడక శక్తిని, హింసని. న్యాయం వీటన్నిటినీ జయిస్తుందని నాకు దృఢ విశ్వాసం వుంది."

పందొమ్మిదివందల నలభై ఒకటి జూన్ లో జర్మనీ రష్యా మీద హటాత్తుగా విరుచుకు పడింది. ఈ వార్త విని అప్పటి బ్రిటిష్ ప్రధాని చర్చిల్ అదిరిపడ్డాడు. ఆవేళ రాత్రే, అంటే జూన్ యిరవై రెండున చర్చిలు బి.బి.సి. లో మాట్లాడుతూ రష్యా ప్రమాదం స్వేచ్ఛా ప్రపంచానికే ప్రమాదం అన్నాడు.

ఐరోపా యుద్ధంలో మునిగిపోయిన ఐక్యరాజ్యాల వాళ్ళు ఆగ్నేయ ఆసియా యుద్ధరంగం మీద చూపించవలసిన శ్రద్ధ చూపించలేదు. పైగా జపాను శక్తిని తప్పు అంచనా కట్టేరు. ఉపేక్షించేరు. అంచేత జపాన్ మెరుపులా పురోగమించింది.

బర్మా రంగపు కీకారణ్యాల్లో కొండలోయల్లో అవలంబించవలసిన యుద్ధతంత్రం తెలీక బ్రిటీష్, ఇండియన్, గూర్ఖా చీనీ పటాలాలు చెల్లాచెదరై పోయాయి. తుబ్బె తుబ్బెలై పోయాయి. సరైన ఆయుధాల్లేక, మందుగుండు సామాగ్రి లేక చిందరవందరైన వేలాది పటాలాలు; తిండి, నీరు లేక, జబ్బులు చేసి వైద్యసహాయం లేక, నిలవ నీడలేక, నడవలేక మలమల మాడిపోయేయి. కొన్ని డివిజన్లు నామరూపాల్లేకుండా నశించి యితర బలగాల్ని అమెరికను బలగం కలిసింది.

నిమిషాల మీద లక్షలకొద్దీ సైన్యం ఆగ్నేయ ఆసియా రంగానికి తరలించబడింది. శత్రువుని తిప్పికొట్టడానికి. పటాలాల ఆయుధాలు, దుస్తులు ఒకటేమిటి అన్నీ మెరుగు చేసేరు. ఇటు కలకత్తా, అటు ఢాకా నించి చిట్టగాంగు వరకూ ఎక్కడ చూసినా పటాలం పటాలం. ఊళ్ళల్లో, కొండలమీద, లోయల్లో, మైదానాల మీద, రోడ్లమీద, వంతెనల మీద, రైళ్ళలో ఎక్కడ చూసినా పటాలం పటాలం. తూర్పు బెంగాలు కాలేజిల్లో భవనాల్లో పటాలం పటాలం. కార్లు, లారీలు, చివరికి సైకిళ్ళు కూడా పటాలం వశపర్చుకుంది. సివిల్ జీవిత వాతావరణం మందులోకి మాత్రం మిగిలింది. మిగిలిందంతా ఎక్కడికి పోయిందో చెప్పలేం.

తట్టితే కవిత్వం పలికే మట్టి యినప బూట్ల కింద నలిగింది. సుందరమైన, శృంగారమైన గుట్టలూ, తోటలు మిలిటరీ వశమయేయి. సామాన్యమైన, సున్నితమైన మానవ జీవితం నల్లబజారు, తాగుడు, వ్యభిచారం, లంచం, నిరాశ, నిర్లజ్జ, దోపిడి చేసే వీరవిహారంలో పచ్చడైపోయింది.

ఆర్.హెచ్.క్యూ వెళ్ళిపోయిన తరువాత నేను, మా ఓ.సీ. పది పన్నెండుగురు తెల్లవాళ్ళు డబ్బైయెనభై మంది భారతీయులు మిగిలేం. మూడ్రోజులిలాగే గడిచాయి.

రోజూ నేనూ ఓ.సి. ఒకరి మొహం ఒకరు చూసుకుంటూ ఆఫీసులో కూచుంటున్నాం. నేనప్పుడేదో టైపు చేస్తున్నా. రెండు కాగితాలు ఫైల్లో వేస్తున్నా. వర్కుషాపు ఎక్విప్ మెంటు టేబిల్ లో వున్న వాటిని ఇండెంటు ఫారాల మీద టైపు చేస్తున్నా. ఆ గ్రంథంలో మాక్కావలసినవి, పిన్ను దగ్గిర్నుంచి ట్రాక్టరు దాకా అన్నీ వున్నాయి. ఆ యిండెంటు బ్రిగేడు హెడ్

క్వార్టర్సు ద్వారా పంపితే, దేశం నలుమూలల్నించి ఇంకా ప్రపంచం నలుమూలల్నించీ సరుకు వచ్చిపడుతుంది. వాటితో మా వర్కుషాపు చకచకా తయారౌతుంది.

మా ఓ.సీ.కి చిన్న యెర్రని మీసం వుంది. పని లేనప్పుడా మీసంలో వెంట్రుకలు ఎడం చేత్తో నిమ్మళంగా సవరిస్తూ, తీవ్రమైన చూపులతో తూచి తూచి మాట్లాడుతాడు. అతనేమంత చదువుకున్నవాడు కాదు. వాళ్ళ స్వస్థలం చెషైరు, అతని తండ్రి ఎలెక్ట్రీషియన్. తండ్రి దగ్గరే తర్ఫీదయ్యేడు. తరవాత ఒక వర్కుషాపులో "అప్రెంటిస్" చేసేడు.

పెళ్ళి చేసుకొని స్వంత కాపురం పెట్టిన సంవత్సరానికే అతన్ని పటాలంలో భర్తీ చేసేరు. తిన్నగా భారతదేశం పంపేరు. అతను దేశం విడిచి పెట్టినప్పటికి భార్య నాలుగో నెల గర్భిణీ. తరవాత కొడుకు పుట్టేడు. వారం వారం భార్య కొడుకు ఫోటో పంపుతూంది. అప్పుడప్పుడతనికి యింటి మీద ధ్యాస వెళ్ళిపోయేది. అలాంటప్పుడు దిగులుగా మీసంలో వెంట్రుకలు సవరించేవాడు. కాని, వెంటనే “మనం యుద్ధంలో వున్నాం”అని జ్ఞప్తికొచ్చేది. ఒకసారి తేల్చి "అయామ్ సారీ" అని గబగబ కాయితాలు చూసుకునేవాడు. మళ్ళీ వెంటనే నాతో వేదాంతం మాట్లాడేవాడు.

“రావ్! ఈ యుద్ధం ఎందుకు జరుగుతుందో నీకు తెలుసా!” హుందాగా కాలేజీ లెక్చరరు విద్యార్థి నడిగినట్టు ప్రశ్నించేడు.

“కారణం యేమైనా సుఖానున్న ప్రాణాలు దుఃఖం పాలౌతున్నాయి.”

“అయితే నీకీ యుద్ధం యిష్టం లేదా?”

“మీకిష్టమా?"

“ముమ్మాటికీ కాదు. కాని, యీ యుద్ధం మానవుడి మనుగడ నిలబెట్టుకుందికి చేస్తున్నాం. ఈ యుద్ధం యివాళ కోసం కాదు, రేపటికోసం. ఈ తరం కోసం కాదు, ముందు తరాల కోసం. మన కొడుకుల కోసం, వాళ్ళ సంతానం కోసం...”

“క్షమించండి, ఇది ఆఖరు యుద్ధమా?”

“అది వేరు...” అతను టేబిలు మీద పెన్ను టక టక కొడుతూ అన్నాడు. “నిప్పీలు (జపానీయులు) ఇండియా స్నేహితులా?” ప్రశ్నించేడు.

“చూడండి. వ్యక్తిగతంగా నేను డబ్బుకోసం, కాస్త దేశం చూడ్డంకోసం పటాలంలో చేరేను. నేనే కాదు, ఈ దేశంలో నూటికి నూరు పాళ్ళూ అంతే. కొన్ని కుటుంబాలు వంశపారంపర్యంగా సైనికులు. అది వాళ్ళ వృత్తి. పోతే ఇండియా బానిస దేశం. దీనికి శత్రువులెవరు, మిత్రులెవరు? ఇండియాకి ప్రస్తుతం శత్రుదేశం ఏదన్నా వుంటే, అది, బ్రిటనే. అర్ధ శతాబ్దం పైగా అహింసా పద్ధతిలో పోరాడుతున్నా బ్రిటన్ ఈ దేశానికి స్వాతంత్ర్యం యివ్వలేదు. చివరికి ప్రాణం విసిగి ఈ

మధ్య ప్రజలొక చిన్న విప్లవం లేవతీసేరు. కాని ఫలితం శూన్యం. ఇక ఈ యుద్ధంలో ప్రమాదవశాత్తూ ఐక్యరాజ్యాలోడిపోతే, ఇండియాలో బ్రిటీష్ పరిపాలన ముగుస్తుంది. మరే దేశమో దీనిమీద యేలుబడి చలాయిస్తుంది.”

అతనొక నిమిషం మీసం సవిరిస్తూ ఆలోచించేడు. “బహుశా” అని యేదో అనబోతుంటే మోటారు సైకిలు మీద కొరియర్ వచ్చి ఒక కవరిచ్చి వెళ్ళిపోయేడు. ఓ.సీ. కవరు విప్పి వుత్తరం చదువుతుంటే అతని మొహం వికసించింది. చిరునవ్వు క్రమేపీ అతని మొహం అంతటా పాకింది.

“రావ్! మనం కదిలేం...”

“ఎక్కడికి?”

“కొమిల్లా’”

ఓ.సీ. ఆర్డర్లీని కేకేసి తెల్లవాళ్ళని పిలవమన్నాడు.

“క్షమించండి. ఇందాక నే చెప్పింది కేవలం వ్యక్తిగత అభిప్రాయం. నేను మిమ్మల్నినొప్పించలేదని భావిస్తున్నా...’”

“నిజం నిజం, యుద్ధం ఎవ్వరికీ యిష్టం వుండదు. కాని ఈ యుద్ధం ప్రపంచాన్ని “నాజిజమ్” “ఫాసిజమ్” నుంచి కాపాడ్డానికి తప్పనిసరైంది.’”

సార్జెంటు మేజరు రెడ్ ఫర్ను, స్టాఫ్ లాంగ్ థార్న్, సార్జెంటు స్మిత్, ఎవరెట్ మొదలైన వాళ్ళంతా వచ్చేరు.

“చూడు, సార్జెంటు మేజర్! మనం కదిలేం.”

“ఎక్కడికి సర్?”

“కొమిల్లా” నవ్వుతూ, తల ముందుకీ వెనక్కీ ఆడిస్తూ, పాట పాడినట్టన్నాడు,

“ఎప్పుడు!’”

“ఈ సాయంత్రం...”

ఆఫీసులో సుమారు నాట్య ప్రదర్శనం అయింది. సార్జంట్ మేజరు నాతో బాల్ రూం డ్యాన్సు చేసేడు. మిగిలిన వాళ్ళంతా “కొమిల్లా, కొమిల్లా, కొమిల్లా’” అని దొమ్మరి డ్యాన్సు చేసేరు. నా గుండెల్లో “పద్మ పద్మ’” అని ప్రతి ధ్వనిస్తూంది.

ఆ సాయంత్రం నాలుగున్నరకి వర్కుషాపు సిబ్బంది అంతా వెళిపోయింది. కారణాంతరాల వల్ల నేను ఓ.సీ. మా ఆఫీసు ఆర్డర్లీ వెనక వుండిపోయేం . మేం మర్నాడుదయం బైల్దేరాలి. మాకొక స్టేషన్ వాగన్ వుంది. ఆ రాత్రి ఓ.సీ. వెస్టాఫ్రికను రెజిమెంటు ఆఫీసర్ల మెస్ కి అతిథిగా వెళ్ళి తిరిగొచ్చి తన బాషాలోనే పడుకుంటాడు. నాకూ తనకీ మా ఆర్డర్లీ వంటచేస్తాడు. కూరల్లేవు, బియ్యం, పాలడబ్బాలు, ఆటా, పంచదార, టీ వున్నాయి. నాదగ్గిర వెన్న,జామ్ వున్నాయి.

సాయంత్రం ఆరుగంటలకి నేను చెరువుకెళ్ళేను. కాలిపోయిన షిరాజ్ పూరు చూస్తే నాకు దుఃఖం కలిగింది. అబ్దుల్, అతని కొడుకు కూతుళ్ళ ఆత్మలు ఆ బూడిదెలో తిరుగాడు తున్నట్టనిపించింది.

పక్కనే వున్న గార్డు రూం తలుపు మూసివుంది. బైట రైఫిలుతో పహారా ఇస్తూండవలసిన ఆర్డర్లీ లేడు. దగ్గిరకెళ్ళి చూశా. గదిలో దీపం కూడా లేదు. తలుపుతోశా. అడ్డంగావున్న కుర్చీ కదిలింది. ఇంకా బలంగా తోశా. తడక తలుపు విడిపోయి అడ్డంగా వున్న కుర్చీలు వగైరా ఒక దానిమీదొకటి పడిపోయేయి. లోపలికెళ్ళి అగ్గిపుల్ల వెలిగించా. ఆశ్చర్యం! మేగ జీనులో వున్న "త్రీనాట్ త్రీ" రైఫిళ్ళ వరసల మధ్యని ఆర్డర్లీ బోర్లా పడుకున్నాడు. నేనతన్ని తట్టిలేపా. నోట మాట రాక సౌంజ్ఞ చేస్తూ ముక్కు మీద వేలేసుకున్నాడు శబ్దం చెయ్యొద్దని సూచిస్తూ. నాకు మరీ ఆశ్చర్యం వేసింది.

"ఉర్ఫాన్! ఏమిటలావున్నావు'''

"ష్! సాబ్! గట్టిగా మాట్లాడకు" గుస గుసలాడేడు.

"ఏం? ఏమొచ్చింది. భూతమా? ఏదీ?"

"వెళిపోయుంటుంది..."

నేను నవ్వేను. హరికేను లాంతరు వెలిగింపించేను. వెంటనే ఉర్ఫాన్ తాళాలు నా దగ్గర్నించి తీసుకుని, గబ గబ మేగజీనులోంచి రైఫిలు తీసి ఐదు రౌండ్లు నింపేడు.

"కొంప ముంచేవు సాబ్! అన్ని రైఫిళ్ళు మేగజీనులో పెట్టి తాళం వేసి పట్టుకుపోతే. నేను బతకాలా చావాలా?"

"ఏం! జపానీలొచ్చారా?''' అని నవ్వేను.

"నవ్వకు సాబ్! మా అమ్మకి నేను ఆఖరి కొడుకుని."

ఉర్ఫాన్ పంజాబీ ముస్లిము. ఇరవై యేళ్ళుంటాయి. సుమారు యెత్తు, బలంగా వుంటాడు.

ఉర్ఫాన్ సేఫ్టికాచ్ లాక్ చేసి, ట్రిగ్గరు వీణ మీటినట్టు నొక్కుతూ చెప్పాడు.

"నువ్వలా వెళ్ళేవో లేదో చూడూ మన లంగరు ఖానా వెనకనుంచొచ్చింది, పెద్ద యెలుగుబంటి. ఇటే వస్తోంది. నేను గార్డు రూము ఓరకి నక్కిపోయేను. అది వెనక్కాళ్ళమీద నడుస్తూ కుప్పిగెంతులేస్తోంది. నా చేతిలో రైఫిల్లేదు. నిమ్మళంగా గార్డురూంలో దూరా. రైఫిళ్ళన్నీ బంద్. తాళం లేదు. చావొచ్చిందనుకున్నా. ఆ గొడ్డు నీ గదిలోకెళ్ళింది. దుబ్బు దుబ్బున నాట్యం చేసింది. తరవాత యిటు మళ్ళింది. ఈ తలుపుకి గొళ్ళెం లేదు. వెంటనే దీపం ఆర్పి తలుపు మూసి కుర్చీ, బల్ల, అన్నీ అడ్డు పెట్టా. తరవాత మేగజీన్లో దూరి, వూపిరి బిగబట్టి పడుకున్నా. ఆ గొడ్డు తిన్నగా ఇక్కడికీ వచ్చింది. ముట్టెతో తలుపు తోసి నాలుగైదు సార్లు''మ్హుమ్హు" అంది. అల్లా కసమ్! నా పనై పోయిందనుకున్నా. కాని అల్లా కాపాడేడు. అది తలుపు గట్టిగా తొయ్యలేక, రోడ్డువేపు "బబ్బ బ్బబ్బ''' అని అరుస్తూ పారిపోయింది. నేను అంతా విని విరగబడి నవ్వా. ఉర్ఫానికి వుడుకుమోత్తనం వచ్చింది.

"ఏమిటి సాబ్; నవ్వుతావు! కాస్త అది ముందూ, నువ్వు వెనక అయిపోయేరు. అది నీ గదిలో కొచ్చినప్పుడు, నువ్వుంటే నీ పని తెలిసేది...."

నేను మళ్ళీ విరగబడి నవ్వేను.

"చూడు భయ్యా. నువ్వు సిపాయివి, ఇంత పిరికిపందనుకోలేదు. ఎలుగొడ్డుకి జడిసిపోయిన వాడివి జపానీయులతో ఏం యుద్ధం చేస్తావ్? గుండెకావాలి దోస్త్. మగగుండె!'''

అతనికి పౌరుషం వొచ్చింది.

"నా దగ్గిర ఆయుధం లేదుకదా సాబ్! ఉంటే ఆ... భల్లూకీ జదుస్తానా. ఇప్పుడు రమ్మను ధనామనిపించేస్తా" అని అవతల కెళ్ళి చీకట్లోకి చూస్తూ "రావే... భలూకీ..."అని గట్టిగా తిట్టేడు. నేను మళ్ళీ విరగబడి నవ్వేను.

"సరే సరే దోస్త్. ఏమైనా వంట చేసేవా?''

"హుఁసాబ్! పరాంఠె, ఖీర్."

ఇద్దరం భోంచేసి సిగరెట్లు కాలుస్తూ కబుర్లాడుకున్నాం.రాత్రి పదిగంటలకి ఓ.సీ. వచ్చాడు.

"అంతా ఓకే!'''

"ఓకే సార్! కాని యిక్కడొక పెద్ద యెలుగు బంటి తిరుగుతోంది... భద్రం" అన్నాను.

"రివాల్వరు సిద్ధంగా వుందే"

అతను తన గదికి వెళ్ళిపోయేడు.

మర్నాడుదయం ఏడు గంటలకి ప్రయాణానికి సిద్ధంగా వున్నాం. కేబిలొచ్చింది.

"సిక్త్సిండియన్ హెవీ యాకాక్ వర్కుషాపు 12 ఎ.బి.సి.ఓ. తోవలో వున్న కర్రవంతెన కూలిపోయింది. మరమ్మత్తు మూడు నాలుగు రోజులు పడుతుంది. అంతవరకూ రోడ్డు ప్రయాణం బంద్–అడ్మిన్ కమ్."

ఓ.సీ. కేబిలు నాకందించేడు. నేనూ చదివా.

"ఏం చేదాం సర్?''

"ఏం చెప్పేది. మనం యిక్కడ యిరుక్కుపోయే...."

"రైలుమీద పోతే"

"ఈ స్టేషను వేగనో..."

"చార్లీ బ్యాటరీ యింకా కదల్లేదు. వాళ్ళకప్ప జెప్పేద్దాం. మీ వుద్దేశం..."

"కరెక్ట్, నువ్వు కరెక్ట్.''

9

వెంటనే ఓ.సీ. చార్లీ బ్యాటరీకి వెళ్ళి అక్కణ్ణించి ఫోన్లో అఖౌరా ఆర్.టి.ఓ. తో మాట్లాడాడు. పదకొండుగంటలకి ఒక రైలు కొమిల్లా వెళుతూంది. దాంట్లో ఒక పెట్టె మాకివ్వడానికి యేర్పాటు చేస్తానన్నాడు ఆర్.టి.ఓ.

మేం పదిగంటలకి బైల్దేరాం. ముందు చార్లీ బ్యాటరీకెళ్ళేం. అక్కడ ఒక సార్జంటు మా స్టేషను వాగన్లో యెక్కేడు. మమ్మల్ని స్టేషన్ కి దిగబెట్టి బండి తీసుకుపోతాడు.

అఖౌరా స్టేషను చేరేసరికి సుమారు పదకొండైంది. బాగా యెండెక్కింది. మాకు కేటాయించిన కంపార్టుమెంటులో సామాన్లు సర్దేం. పదకొండు దాటిందిగాని బండి కదల్దు. ఓ.సీ., నేనూ, ఆర్.టి.ఓ. ఆఫీసుకెళ్ళి బండెప్పుడు బైల్దేరుతుందని అడిగేం. ఏదో అవాంతరం వచ్చింది. రెండుగంటలకి ముందు రైలు కదల్దని తెలిసింది.

మొదట ఆ రైలు ప్లాట్ ఫారానికి కొంచెం యెగువనివుంది. మేం అందులో ప్రవేశించిన గంటకి వెనక్కి “షంట్” చెయ్యబడి డెడ్ లైను చివరకొచ్చింది.

మా పెట్టె ఆగిన దగ్గిర ఒక దిబ్బ వుంది. అది చాలా ఏటవాలుగా వుంది. దానిమీద ఎత్తు వెంపు తల, పల్లంవెంపు కాళ్ళు పెట్టి పాతిక ముప్పైమంది మనుషులు వెల్లకిలా పడుకున్నారు. ఆడా మగా వున్నారు. చాలామందికి ఒంటిమీద గుడ్డలేదు.

వాళ్ళ శరీరంలో ఒక్క నెత్తురు చుక్కైనా లేదు. అరతులం కండైనా లేదు. అస్థిపంజరాలే.

ఆ దృశ్యం చూసేసరికి మా ఓ.సీ.కి రోత కలిగింది. అవతలి వేపు నించి దిగిపోయి రైలు పట్టాలు దాటి ప్లాట్ ఫారం మీదికి వెళిపోయేడు, నాక్కూడా ఆ మనుషుల్ని చూస్తే బాధకలిగింది. ఉర్ఫాన్ని సామాన్లకి కాపలా పెట్టి నేనూ ఓ.సీ. దగ్గిరికెళిపోయేను. నిప్పుల్లాంటి ఎండలో యిద్దరం కొంచెం సేపు ప్లాట్ ఫారం మీద పచార్లు చేసేం. ఉదయం ఏడు గంటలకి బిస్కట్లు తిని, టీ తాగేం. తరవాత మరేంలేదు, మాకు బాగా ఆకలేస్తూంది.

స్టేషనులో తినడానికేమీ దొరకదు. చివరికి సోడాకూడా లేదు. ఓ.సీ. స్టేషనులో దొరికే నీళ్ళు తాగడు, జబ్బు చేస్తుందని భయం. దోమకుడితే నెత్తురొచ్చేదాక పిన్నుతో పొడుచుకుని దానికి డెట్టాలు రాస్తాడు. ఇండియా అంటే అతనికంత భయం.

ఒంటిగంటైంది, బండి కదల్టు. మా కంపార్టుమెంటులో రొట్టె, వెన్న, జామ్ వున్నాయి. కాని అటువేపు వెళ్ళడమంటే భయం. రోతగా వుంది. కదలని బండి ఓమూల, కడుపులో ఎలకలో మూల– అతన్ని పిచ్చెక్కిస్తున్నాయి. నా పరిస్థితీ అలాగే వుంది.

ఉర్వాన్ కిటికీ దగ్గరికొచ్చి "వెన్న సాండ్విచ్ తింటారా సాబ్''అన్నాడు. నేను ఓ.సీ. వేపు చూశా. అతని జఠరాగ్ని భగ్గుమంది. ఫ్లాట్ ఫారం మీంచి రైలు పట్టాల మీదికి ఒక్క దూకు దూకి నాతో "పద" అన్నాడు. మేం తిరిగి పెట్టెలో దూరేం.

అతను పనిగట్టుకుని అటుపక్కకి వెళ్ళి తలుపు తీసి కిందికి చూశాడు. ఎండలో అస్థి పంజరాలలాగే వున్నాయి. వెళ్ళండి లంజకొడకల్లారా ఇక్కణ్ణించి పొండి. అని అరిచేడు. వాళ్ళు పలకలేదు, ఉలక లేదు. అంగుళం కదల్లేదు. ఓ.సీ. చంగున కిందికి దూకేడు. నన్నూ రమ్మన్నాడు. ఇద్దరం వాళ్ళని తేరిచూసేం.

'"హవల్దార్! వీళ్ళని లేవగొట్టి తరిమేయ్" అని పట్టరాని కోపంతో అన్నాడు. నేనతని మొహంలోకి ఒకసారి చూశాను, తిరిగి వాళ్ళ వేపు చూశాను.

వీళ్ళెవరు? మనుషులేనా? మనుషులైతే ఇలా వున్నారేం! శరీరాలు యెండిన కట్టెపుల్లల్లా వున్నాయి. స్త్రీలు కూడా వున్నారు. వాళ్ళ నగ్నత్వం యిలా బట్టబైలైందేం?

అసలు బ్రతికే వున్నారా? బ్రతికుంటే శవాల్లా కదలరేం? కొందరి ముక్కుల్లోకి, నోళ్ళల్లోకి ఈగలు జొరబడి స్వేచ్ఛగా తిరుగుతున్నా అలా పడేవున్నారేం?

తేరి చూసేను. ఒక స్త్రీ పూర్తిగా నగ్నంగా వుంది. ఆమె బొందెలో ప్రాణంలేదు. బల్లి లాటి ఒక చంటిపిల్ల యెలక పిల్లలా కీచు కీచుమంటూ ఆ శవం మీద పడియెండిపోయిన స్తనం చీకడానికి ప్రయత్నిస్తూంది! చచ్చిపోయిన ఆ స్త్రీ నోట్లోంచి బైటకొచ్చిన ఈగలు ఆ పిల్ల పుసుల కళ్ళమీద వ్రాలి తిరిగి శవం నోట్లోకి వెళిపోతున్నాయి. అలాంటి శవాలింకా పది పన్నెండున్నాయి.

మళ్ళీ తేరి చూశా. ఇతని గుండెలో యింకా చిన్న వూపిరి వుంది. నిలకడైపోయినా, ఆ కనుగుడ్లలో యింకా దీపం పూర్తిగా ఆరిపోలేదు. మెదడు పని చేస్తుందా? జీవితపు పొలిమేరల్లో తచ్చాడుతూన్న అతని మనసులో యింకా ఆలోచనలేమైనా మెదుల్తున్నాయా?

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments